రెండు వరాలు

సమయమంత్రి రాజ్యలక్ష్మి

అబలలు అవసరమైనప్పుడే అకా
రాన్ని అవతల వుంచుతారు
కాని వారెప్పుడూ అబలలే.

'ఇందాక అలా కిటికీలోనుంచి వీధిలోకిచూస్తూ నిలబడిపోయావుట ఎందుకు?' అన్నాడు కేశవరావు, అప్పుడే టెన్నిస్‌నుంచి వచ్చి స్నానంచేసి పట్టుపంచ కట్టుకుంటూ.

'మీరింటిదగ్గర లేరుగదా. మీకెలా తెలిసింది నే వీధిలోనికి చూశానని? ఎవరు చెప్పారు?' అన్నది సుశీల, సహజమైన తన సన్నగొంతుకతో.

'ఎవరా? ప్రశ్నకు పైప్రశ్న వేస్తావేం? దుర్మార్గపుపనులు చేస్తుంటే ఎవరేనా చెప్తారు. మా చెల్లాయి మణి చెప్పింది.' అన్నాడు కోపంతో.

'మీ చెల్లాయి చూస్తే తప్పులేదా?' అంది సుశీల, కొంచం బెంకితనంగా.

'దాని జోలి నీకెందుకు? నీవిషయం సమాధానం చెప్పు' అన్నాడు కసరినట్టుగా.

'సాయంకాలం మీరు వెళ్లాక మణీ, నేనూ గదిలో కూర్చున్నాం. ఇంతట్లోకే వీధిలోకి 'అమర జ్యోతి' సినీమా బండి వచ్చింది. ఇద్దరమూ చూశాం కిటికీదగ్గర నిలబడి. ఇందులో నాది తప్పయి, ఆవిడది ఒప్పు ఎందుకైయ్యిందో నాకు తెలియదు' అంది.

'అబ్బాయీ! వడ్డించా! రా! నాయనా! ఎంతచెప్పినా దానిబుద్ధి అంతే బాబూ? ఇంతకూ నీ కర్మం. చదువుకుంటూన్న పిల్ల వద్దని నే మొదటే చెప్పాను. రా! అన్నం చల్లారిపోతూంది,' అని పిలిచింది తల్లి సుబ్బమ్మ.

'ఇటువంటి పాడుపను లెప్పుడేనా చెయ్యి చెప్తా.' అంటూ ఒక్క తోపుతోసి భోజనానికి వెళ్లాడు కేశవరావు.

కండ్ల నీరు కారుకుంటూ తమలపాకులు మడుస్తూంది సుశీల. కాపరానికి వచ్చినది మొదలిదే వరస. సుశీల తల్లిదండ్రుల కిద్దరాడవాళ్లు మాత్రమే. సుశీల కడగొట్టుది. పెద్దామెకు బాల్యవివాహం, ఆరునెలలు తిరక్కుండా బాల్యవైధవ్యం సంభవించాయి. ఆమెకష్టాన్ని మనస్సులోపెట్టుకుని సుశీలని పదిహేను

సంవత్సరాలు వచ్చేవరకూ ఆరవఫారంవరకూ చదివించినతర్వాత బి. యె. చదువుతున్న కేశవరావుకిచ్చి మహావైభవంతో వివాహంచేశాడు, రెండువేలరూపాయలు కట్నంతో, సుశీల తండ్రి సుబ్బారావుగారు. సుశీల కాపరానికివచ్చి రెండుసంవత్సరాలైంది. అప్పటినుంచీ, మామగారి ఆస్తికి తానే హక్కుదారుడననీ, ఇప్పుడే తనపరం చేయవలెననీ, పెంకెతనంచేత సుశీలని పుట్టింటికి పంపడంలేదు, కేశవరావు. B. A. ప్యాసు అయ్యి రెండేండ్లయినా 'డిప్రెషను' మూలాన్ని వుద్యోగమేమీలేదు కేశవరావుకి, భార్యని బాధించడం తప్ప. రెండుపూటలా క్లబ్బుకు పోవడం, టెన్నిసు ఆడడం, సిగరెట్టు పీల్చడం బాగా అలవాటయాయి. కాని ఎంతచదువుకున్నా కేశవరావుకి స్త్రీ స్వాతంత్ర్యం కిట్టదు. భార్యమీద అనుమానమూ, భార్య అంటే దాసీ అనే భావమూ, సుశీలని చాలా బాధిస్తున్నాయి.

సుశీల చాలా చురుకూ, తెలివీ గలది. స్వతంత్రపు టూహాలలో పెరిగింది. సంస్కరణప్రియురాలు. కేశవుని మనసారా ప్రేమించింది కాని అతని పూర్వాచార పరాయణతనీ, అతనికి స్త్రీలయందుండే నీచ భావాన్నీ, కుంచితహృదయాన్నీ చూచి అసహ్యించుకునేది. విచారించేది. 'ఎలాగైనా, ఎప్పటికైనా, తన జీవితమంతా ధారపోసి అయినా, తనభర్తను హిందూసంఘాలలో వుండే పాడు ఆచారాలూ దౌర్జన్యమూ కనబరచి, ఆ భావాన్ని మార్చలేకపోతానా? అట్టి సుదినం తన జన్మలో రాదా?' అని రోజులు గడుపు తూంది. అతనియందుండే పవిత్రప్రేమవల్లనే అతనుపెట్టే బాధలను సహిస్తుంది.

౨

అది వేసవికాలం. రాత్రి భోజనం అయి సిగరెట్టు పీలుస్తూ గది దొడ్లో మల్లెపందిరిదగ్గర ఈజీ చైర్‌లో కూర్చున్నాడు కేశవరావు. మల్లెపందిరిలోనుంచి వెన్నెల బొట్లులా పడుతూంది కేశవుడుమీద. తమకున్న సౌరభాన్నంతా ఒక్కసారిగా వెదచల్లుతూన్నట్లు పరిమళిస్తున్నాయి అరవిచ్చిన మల్లెపూలు. వంటయింటి పనులన్నీ చక్కపెట్టుకుని మడిచీరవిడిచి, మడతచీర కట్టుకుని వచ్చింది సుశీల.

'సుశీలా! యిలా కూర్చో. ఏమేనా విశేషాలు చెప్పు' అన్నాడు కేశవుడు. యిటువంటి సంతోషసమయాలు చాలా అరుదు సుశీలకి.

'విశేషాలేమీలేవు గాని, ఎన్నాళ్ళనుంచో ఒకవిషయం అడుగుదామని అశ్రద్ధచేస్తున్నాను. ఇది సమయమా?' అంది సుశీల, ప్రక్కనే కర్జూరం ఆకుల చాపపరచి కూర్చుంటూ.

'ఏం! మా అమ్మ సాధిస్తూందని వేరుండాలనా? లేకపోతే నీకు తగినవాడను కాదని పుట్టింటికి ప్రయాణమా? ఏది నీ కోర్కె?' అన్నాడు కేశవరావు.

'నేనిలా అడుగగానే మీరలా యెందుకు భావించుకోవాలి? మీ అమ్మగారు సాధిస్తున్నారని నేనెప్పుడేనా అన్నానా? పెద్దవాళ్ల అదుపాజ్ఞలు లేకపోతే ఈకాలపు సీతాకోకల్లాంటి యువతులు అదుపాజ్ఞలలో వుంటారా? మీరాదరించడం లేదని ఎప్పుడేనా విసుక్కున్నానా? తమరలిగి అమ్మగారింటికి పంపకపోతే, పంపమని అడిగానా? ఏది యెలా జరిగినా 'మన అదృష్టం' అని భావించుకుంటూంటే ఒక విధమైన తృప్తి కల్గుతుంది మనస్సుకి. మన ఆర్యులు 'కర్మ' సూత్రాన్ని కేవలం మన ఆంధ్రులకు, ముఖ్యంగా ఆంధ్రస్త్రీలకూ సృజించారనుకుంటూ.'

'సుశీలా! నీతో నే వాదించలేను. అసలు నీసంగతి ఏమో చెప్పు' అన్నాడు కేశవుడు.

'మన సంఘం విషయంలో నాకు తెలిసినంతవరకూ వ్యాసాలు వ్రాదామని కుతూహలం. మన వివాహానికి పూర్వం ఏమేనా వ్రాసేదాన్ని. యిప్పుడు తమరిష్టపడాలిగాదూ మరి!'

'ఇప్పుడుమాత్రం నేను యిష్టపడక, నీవు మహాకష్టపడుతున్నావు కాబోలు. అయినా సంఘంలో నీవు దిద్దాలిసిన తప్పులేమున్నాయి?' అన్నాడు వేళాకోళంగా.

'మీరు ప్రతీదానికీ నన్ను వేళాకోళంచేస్తే ఎలాగ? ఎన్నో మంచివి, ఎన్నో చెడ్డవి ఆచారాలు వుండవచ్చును. నాకు తెలిసినవి స్వల్పం. ఇక నేను సమర్థించగలిగేవి లెక్కలేకవుంటాయి' అంది సుశీల కేశవుని దీర్ఘసంభాషణ కాశ్చర్యపడుతూ.

'అవేవో చెప్పు చూదాం!'

'మొదటిది 'స్త్రీ స్వాతంత్ర్యం' గురించి.'

'స్త్రీకి స్వాతంత్ర్యంలేక జైల్లో పెట్టారా?'

''జైలు' అంటే వ్యక్తిస్వాతంత్ర్యం నశించిందన్నమాట. ఖైదీ ఎక్కడకు వెళ్లేందుకూ వీలులేదు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి పోయేప్పుడుకూడా ఒకరు కాపలావుంటారు. స్త్రీకి అంతే. ఆమె ఎక్కడకు వెళ్లేందుకు వీల్లేదు. మగవారి అనుజ్ఞ కావాలి. కాకుండా ఎవరో సాయముండాలి. నిజంగా స్త్రీకి వ్యక్తిస్వాతంత్ర్యం వుందో, లేదో, నిష్పక్షపాతంగా మీరే ఆలోచించి చెప్పండి చూదాం.'

'సుశీ! నీతో వాదించడం కష్టం కాని, మన పూర్వుల ఆచారాలు మనం ఆచరిస్తున్నాం. ఇందులో మన తప్పేమున్నది?'

'నిజమే! కాని, యెన్నాళ్లు 'గానుగయెద్దు' మాదిరిగా వుండడం? అప్పటి స్త్రీలకు పారమార్థిక వాంఛ యెక్కువగా వుండడంవల్లా, అప్పటి పురుషులకు స్త్రీ అంటే యింత నిరసనభావంలేక పూజ్యభావం వుండడంవల్లా, మనవారు ధర్మశాస్త్రాలు సృజించేటప్పటికి దేశం స్వాతంత్ర్యంగా వుండడంవల్లా వారికీ హక్కులతో నిమిత్తం లేకపోయింది. వారు కోరలేదు. క్రమంగా, పురుషులు అడుగునత్రొక్కారు స్త్రీ స్వాతంత్ర్యాన్ని. మనకు భగవంతుడు దయాపూరితమైన మనస్సూ, తెలివిగల మెదడూ యిచ్చినప్పుడు ఎందుకు వుపయోగించుకోకూడదూ?'

'యిప్పటి స్త్రీలుమాత్రం పారమార్థికచింత యెందుకు వుంచుకోకూడదూ? వీరుచేసే పనులు యిప్పుడుమాత్రం ఏమి మిగిలిపోయాయి?'

'అదికాదు! యిప్పటి దేశకాలపరిస్థితులనుబట్టి స్త్రీ చేయవలసిన పనులలో, స్త్రీ స్వాతంత్ర్యం ముఖ్యావసరం. స్త్రీలు పరదాలుదాటి బయటికివస్తేనే గాని స్వరాజ్యం, స్వాతంత్ర్యం రాదు. ఈ దేశంలో పురుషులకుమాత్రం వున్నదా పూర్తిగా వ్యక్తిస్వాతంత్ర్యం? స్త్రీలను పరదాలలోనుంచి పైకి రానిస్తే దేశానికే మోక్షం కలుగవచ్చు.'

'అబ్బా! ఎంతవరకూ వచ్చావు సుశీలా! ఇన్ని ఆశయాలు నీ హృదయంలో కప్పిపుచ్చి ఎలా యిలాటి కాపురం చేస్తున్నావో నాకు చాలా ఆశ్చర్యంగా వుంది' అన్నాడు చెక్కిలి నిమురుతూ.

'అదే భారతస్త్రీకి గల ఉత్తమోత్తమ శుభలక్షణం. ఒకవేళ స్త్రీలకు సమానహక్కులిచ్చి నప్పటికీ భరతమాత పుత్రిక లంత మూర్ఖురాండ్రు కానేరరు. అబలలు అవసరమైనప్పుడే ఆకారాన్ని అవతల వుంచుతారు కాని వారెప్పుడూ అబలలే.'

నిదానించి చూస్తూ 'సుశీలా! నీ బుగ్గలలా పాలిపోయినాయేమి?' అన్నాడు ప్రేమపూర్వకంగా.

'ఉండండి! పిల్లి పాలుమీద మూత పడత్రోసినట్టుంది' అంటూ వెళ్లిపోయింది సిగ్గుపడుతూ.

కేశవు డాశ్చర్యపడుతూ కూర్చుండిపోయాడు సిగరెట్టు పూర్తిచేసి.

3

'నేను మళ్లా యిరవైఒకటోరోజున పంపుతానండీ, అంత అదృష్టవంతులమైతే. అక్కగారూ! నామాట వినండి. మళ్లా వర్జం వస్తుంది పంపండీ' అంటూ బ్రతిమాలారు సుబ్బారావుగారు కూతురుకు నూడిదయిచ్చి. 'ఏమోనమ్మా నాకెందుకూ. నా పెత్తనమేమున్నా పెంకులవుతూందా? అడగండి. మీ అల్లుడి యిష్టం. మీ అమ్మాయి యిష్టం. నాకెందుకూ రవ్వా రొష్టూనూ' అని సాగదీసుకుంటూ యెలాగైతేనేం, సుశీలని పురిటికి పంపనీయలేదు అత్తగారు సుబ్బమ్మ.

సుశీలా కేశవులలో కాలం మారింది. ఆ పాలిపోయిన బుగ్గలూ, కండ్లలోని నీరసమూ, కాస్సేపు పనిచేసేటప్పటికే శ్రమను తెలిపే ముఖంమీది ముత్యాల్లాంటి చెమటబిందువులూ, నడుములోని ఆధిక్యతా, గమనంలోని మందమూ, కేశవునిలో ప్రేమను రేకెత్తించాయి. కాని చాలా బలహీనంగా వుంది సుశీల. మందు యిప్పించేవారుగాని, పుచ్చుకోమనేవారుగాని లేరాయింటిలో. అప్పుడప్పుడు కేశవుడనుకునేవాడు గాని డబ్బూ, స్వాతంత్ర్యంకూడా లేదు తనకి. ఒకమారు తల్లితో ప్రస్తావించాడీ విషయం. వెంటనే సుబ్బమ్మగారు సూరేకారంలా అయిపోయింది.

సుశీలకు పురిటిసమయం సమీపించింది. రెండురోజులనుంచి ప్రసవవేదనపడుతోంది. పురుడువచ్చే సూచనలేమీ లేవు. పురిటికి, పుట్టింటికి తానైనా స్వతంత్రించి, పంపనందుకు పశ్చాత్తాపపడుతూ మామగారికి కబురంపాడు కేశవరావు, తమ్ముని ప్రోత్సాహంతో. వెంటనే బయలుదేరి వచ్చారు సుబ్బారావుగారు కంగారుపడుతూ. రావడంతోనే సుశీల అవస్థచూచి తక్షణం డాక్టరుకోసం దగ్గరవున్న టౌనుకు వెళ్లారు.

కాని సుశీల పరిస్థితి ఏమీ బాగాలేదు. తన స్థితిగతులు గమనించి కేశవుడికి వర్తమానంచేసింది. వచ్చాడు కేశవుడు కళ్లనీళ్లు గ్రక్కుకుంటూ భార్యదగ్గరకి. 'సుశీలా! ఏమిటి సమాచారం?' అన్నాడు గద్గదంగా. 'సమాచారం ఏమీలేదు. నాకు చాలా నీరసంగావుంది. నాకిక భగవంతుని సెలవయింది మీదగ్గర సెలవుపుచ్చుకునేందుకు.'

'సుశీలా! భయంలేదు. మీ నాన్నగారు వచ్చారు. డాక్టరుగారికోసం వెళ్లారు. వచ్చేస్తూ వుంటారు. భయపడకు సుశీలా! నా నిర్లక్ష్యానికిప్పుడు చాలా విచారిస్తున్నా' అని వెక్కివెక్కి ఏడ్చాడు కేశవుడు.

‘ఇప్పుడేమీ లాభంలేదు. నేనిక బ్రతకను. మీదగ్గరనుంచి ఆనాడొక వరం పొందాను. ఈనాడు యింకో రెండువరాలు పొందాలని వుంది. అనుగ్రహిస్తే నిశ్చింతంగా ప్రాణం వదుల్తా’నంది నీరసంగా.

‘తప్పకుండా, సుశీలా! నీవు బ్రతికినన్నాళ్లు నేనెన్ని బాధలుపెట్టాను సుశీలా. నాలాంటి కఠినుడికి నీవెలా దక్కుతావు. నా ప్రాణాన్నిచ్చైనాసరే నీ కోర్కెలుతీర్చి, నీ ఆత్మకి శాంతి చేకూరుస్తా’నన్నాడు ఏడుస్తూ. ‘మనదేశంలో స్త్రీని భోగవస్తువులా చూడక, ఆమెయొక్క సున్నితహృదయాన్నీ, ఉదారపూరితాలైన ఆశయాల్నీ, వ్యక్తిత్వాన్నీ గమనించి ఆమెకు సమానహక్కులిచ్చి దేశాన్నీ, సంఘాన్నీ వుద్ధరించడం ముఖ్యావసరం. మీరు వివాహమాడే స్త్రీకి సమానహక్కులిచ్చి ఆదర్శకు లవడం మొదటికోర్కె. మీ వివాహం వితంతూద్వాహంగా వుండడం రెండవది. ఈ రెండూ ప్రసాదించి ఆచరిస్తే ఈ ఆత్మ సంతోషంతో వెళ్లిపోతుందీ శరీరంలోనుంచి’ అంది. ఆయాసం పూర్తిగా హెచ్చింది.

‘నేనిక వివాహం చేసికోను. కాని నా జన్మ అంతా నీ కోర్కెలను సఫలీకృతంచేయడానికే వినియోగిస్తానని భగవంతునిసాక్షిగా చెప్పుతున్నా. ‘సుశీలా, నా సుశీలా! నన్ను వదలివెడుతున్నావా?’ అంటూ పెద్దగా రోదిస్తున్నాడు కేశవరావు.

ఇంతలో బర్రుమని చప్పుడై కారు ఆగింది. ముచ్చెమటలతో సుబ్బారావుగారూ, డాక్టరుగారూ, నర్సూ దిగారు. కాని సుశీలమాత్రం ఈలోకంలో లేదు.

అస్తమయము

పట్టుమబ్బురథాలఁ బయనించు తేజస్వి - బంగారమొలికించు ప్రభల ప్రభువు
బ్రదుకులోఁ బ్రాణసారముపోయు వైద్యుండు - పాపపుం జీఁకట్లఁ బాపుఱేఁడు
ప్రకృతినవ్వుల పంటఁబండించు కృషికుండు - పండ్రెండుమూర్తులఁ బరగువేల్పు
పరమాత్ము నాకృతిఁ బ్రకటించు ఫణిహారి - స్వర్గమర్త్యంబుల సంధికర్త

గీ॥ జగతివెలిగించు వేయివెలుఁగుల మగఁడు
త్రిగుణములకును నాధారమగు విభుండు
సకల కళ్యాణములఁ గూర్చు సత్త్వమయుఁడు
భాస్కరుం డస్తగిరి ప్రక్కఁ బవ్వళించె.

కొమరవోలు నిర్మలాదేవి.